క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దేవస్థానం ఉద్యోగి రాముకు చెక్కు అందజేస్తున్న దాత రామానుజం

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి అన్నప్రసాద పథకానికి గురువారం పెందుర్తిలోని శారదానగర్‌కి చెందిన ఎం.రామానుజం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. సింహగిరిపై ఉన్న మే ఐహెల్ప్ యు కేంద్రంలో దేవస్థానం ఉద్యోగి రాముకు చెక్కు అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

సింహాచలం: 11 కేవీ శ్రీనివాసనగర్ ఫీడర్, దువ్వపాలెం పరిధిలో దెబ్బతిన్న పాత విద్యుత్ స్తంభాలు, కండక్టర్లు మారుస్తుండడంతో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ గోపాలపట్నం ఏఈ డి.వి.ఎల్. కుమార్ తెలిపారు. 93వవార్డు పరిధిలోని గణేష్‌కాలనీ, శ్రీనివాసనగర్, ప్రహ్లాదపురం, గొల్లనారాయణపురం, పెందుర్తి మండలంలోని దువ్వపాలెం, ఎస్.ఆర్.పురం తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సబ్బవరం: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ల నిర్వహణ,మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్ బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం



93వవార్డులో ప్రచారం చేస్తున్న దాసరి రాజు

సింహాచలం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని 93వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దాసరి రాజు విజ్ఞప్తి చేశారు. వార్డు పరిధిలోని ఈస్టుపాయింట్ కాలనీ, సత్తెమ్మతల్లి ఆలయం వీధిలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పార్వతి, అప్పలరాజు, సత్తిబాబు, వెంకటేష్, రామ్‌గణేష్ పాల్గొన్నారు.

ఘరానా దొంగలు

- పోలీస్‌స్టేషన్‌కే కన్నం వేసిన ఘనులు
- రూ. లక్షల విలువైన స్క్రాప్ చోరీ

మల్కాపురం : అక్కడ.. ఇక్కడ ఎందుకనుకున్నారో ఏమో ఏకంగా పోలీస్‌స్టేషన్‌కే కన్నం వేశారీ దొంగలు. స్టేషన్ వెనుక దాచిన ఇనుప సామగ్రిని తస్కరిస్తూ తమ చోరకళ ప్రదర్శిస్తూ వచ్చారు. దశల వారీగా స్టేషన్ వెనుక ఉన్న స్క్రాప్‌ను దొంగిలిస్తూ చివరికి పట్టుబడ్డారు. ఆలస్యంగా తెలుసుకున్న క్రైమ్ పోలీసులు విషయం తెలిసి గతుక్కుమన్నారు. దొంగతనానికి తమ స్టేషనే దొరికిందా అనుకుని నలుగురు ఘరానా దొంగలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇంకా ఆరుగురు దొరకాల్సి ఉంది. క్రైమ్ అధికారుల ద్వారా తెలిసిన సమాచారం మేరకు.. 40వ వార్డు ఏకేసీకాలనీకి చెందిన సుమారు పది మంది యువకులు ఇక్కడికి సమీపంలోని పోలీస్‌స్టేషన్ వెనుక శిథిలావస్థలోని పోలీస్ క్వార్టర్స్‌లో తమ చేతివాటం చూపించారు. వివిధ దొంగతనాల్లో స్వాధీనపరచుకున్న ఇనుప సామగ్రి, ద్విచక్ర వాహనాలను పోలీసులు ఇక్కడ స్టోర్ చేస్తుంటారు. 2006లో ఓ దొంగతనం కేసులో స్వాధీనం చేసుకున్న సుమారు రూ. లక్ష విలువైన ఇనుప స్క్రాప్‌ను ఇక్కడ డంప్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న పది మంది దొంగలు ఈనెల 5వ తేదీ రాత్రి సామగ్రి భద్రపరిచిన గది వెనుక తలుపునకు కన్నం వేసి స్క్రాప్ సామగ్రిని కొంత కొంత తరలిస్తు వచ్చారు. దాన్ని ఎప్పటికప్పుడు అమ్ముకుంటున్నారు. ఇది గుర్తించిన పోలీసులు వెంటనే దీనిపై విచారణ చేపట్టారు. దీనికి బాధ్యులైన వారిలో నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా.. మరో ఆరుగురికి ఇందులో ప్రమేయం ఉందని తెలుసుకున్నారు. వారు కూడా దొరికిన తర్వాత దీనిపై కేసు నమోదు చేసి దొంగలను రిమాండ్‌కు తరలిస్తామని క్రైమ్ అధికారులు తెలిపారు.

కరుణించమ్మా..కాపాడమ్మా..

అమ్మ దర్శనంతో భక్తులు పులకించిపోయారు. కరుణించి, కాపాలడాలని వేడుకున్నారు. అంతకాపల్లి, బంగారమ్మపాలెం, వేపగుంట, పి.గోనంగిలలో గురువారం గ్రామ దేవతల పండగలను ఘనంగా నిర్వహించారు. ఆలయాలకు పెద్ద ఎత్తున వెళ్లిన భక్తులు పసుపుకుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

- ఘనంగా గ్రామదేవతల పండగలు
- పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకున్న భక్తులు



పూలరథం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



అంతకాపల్లిలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ దంపతులు

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి, బంగారమ్మపాలెం గ్రామాల్లో ముత్యాలమ్మతల్లి అమ్మవారి పండగ వైభవంగా జరిగింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బారులుతీరి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. గ్రామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాత్రి మేళతాళాలతో అమ్మవారి అనుపు మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. స్థానిక శాసన సభ్యుడు అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దంపతులు అంతకాపల్లిలోని ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు అమ్మవారిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు దంపతులు, సర్పంచ్ సబ్బవరపు ముత్యాలనాయుడు, వైస్ ఎంపీపీలు చొక్కాకుల గోవింద్, ఝాన్సీ లక్ష్మీరాణి,మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, మాజీ సర్పంచ్ ఎస్.దేముడు తదితరులు ఉన్నారు.

బంగారమ్మపాలెంలో కొలువైన ముత్యాలమ్మ అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రథమ స్థానంలో బంగారమ్మపాలెం, ద్వితీయ స్థానంలో నాయుడుతోట, తృతీయ స్థానంలో గొండుపాలెం జట్లు నిలిచాయి. ఆ జట్లకు వరసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను సర్పంచ్ దాడి లావణ్య, ఎంపీటీసీ రాపేటి అరుణ, మాజీ ఎంపీటీసీ దొడ్డి అరుణ అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు, రాపేటి రాము, దొడ్డి సూర్యప్రకాష్ ,కోరుబిల్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



దుర్గమాంబను దర్శించుకుంటున్న గ్రామ పెద్దలు



వేపగుంటలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు

వేపగుంటలో..

సింహాచలం: వేపగుంట ప్రజల ఆరాధ్య దేవత ముత్యామాంబ అమ్మవారి పండగ గురువారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారికి పసుపుకుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పండగను పురస్కరించుకుని నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పెందుర్తి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, 93,94,95 వార్డుల కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బల్ల శ్రీను, ముమ్మన దేముడు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా దుర్గమాంబ పండగ

పరవాడ: మండలంలోని పి.బోనంగిలో దుర్గమాంబ పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి గ్రామస్తులు పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ డెక్క శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు సంజీవరావు, కప్పరాడ శ్రీను, కృష్ణ, గోవిందు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గ్రామానికి చెందిన దాసరి శ్రీను ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఉచిత ప్రసాద వితరణ జరిపారు. డప్పులు, చిడతలు, తప్పెడుగుళ్లు, నేల డ్యాన్సులు, సాముగరిడిల మధ్య అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం బాణసంచా కాల్చారు.

ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవంలో పాల్గొన్న జీజీఎం సిన్హా దంపతులు



క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న జీజీఎం సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో దీపాంజలి నగర్ టౌన్‌షిప్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సంగమం ఆడిటోరియం భవనంలో నిర్వహించిన ఈ వేడుకలను సంస్థ జీజీఎం ఎస్.కె.సిన్హా గురువారం ప్రారంభించారు. 'రోజు వారీ జీవితంలో సుస్థిర భవిష్యత్తు కోసం లింగ సమానత్వం' అనే అంశంపై అమెరికాకు చెందిన బన్సల్ మాట్లాడుతూ లింగ సమానత్వం అవసరమన్నారు. అనంతరం కాంట్రాక్టు మహిళా కార్మికులు, గర్భిణుల ఆరోగ్యం, పొగాకు, మద్యం వినియోగం, భద్రతపై దీపికా లేడీస్ క్లబ్ ప్రతినిధులు అవగాహన కల్పించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా కేక్ కట్ చేశారు. మహిళా ఉద్యోగులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన వేడుకల్లో భాగంగా చివరి రోజైన గురువారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో బేసిక్ ఫస్ట్ ఎయిడ్, సీపీఆర్ స్కిల్స్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆరోగ్య శాఖ అధికారి పి.రామారావు మాట్లాడుతూ రక్తస్రావం, విద్యుదాఘాతం, కాలిన గాయాలు, పాము కాటు వంటి వాటికి తక్షణ చికిత్సపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెర్నింగ్ ఏజీఎం కె.వి.ప్రసాద్, హెచ్ఆర్ ఏజీఎం రుమాడీ శర్మ, సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీఎస్ఆర్ఎం కార్యదర్శి సుబ్బారావు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో ఎంఏఎస్ఆర్ఎం ఆధ్వర్యంలో జాతీయ మహిళ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఎంఏఎస్ఆర్ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు మాట్లాడుతూ మహిళల భద్రతకు తగిన చర్యలు తీసుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. మహిళా ఉద్యోగులకు పలు పోటీలను నిర్వహించి బహుమతులుఅందజేశారు. ఎంఏఎస్ఆర్ఎం అధ్యక్షుడు వెర్దంతి, పరిశ్రమ యాజమాన్య ప్రతినిధి శివరామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన అవసరం

ఆరిలోవ: కిడ్నీ వ్యాధులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అపోలో నెఫ్రాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ రవిరాజు తెలిపారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం అపోలోలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు దశాబ్దం నుంచి కిడ్నీ వ్యాధులు పెరిగాయన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన లేకపోవడమే కారణమన్నారు. వాటి లక్షణాలను గుర్తించగలగాలన్నారు. ఆకలి తగ్గడం, ఆయాసం రావడం, కాళ్ల పొంగులు రావడం తదితర లక్షణాలు కిడ్నీ వ్యాధి ప్రారంభ దశకు లక్షణాలని సూచించారు. అలాంటి లక్షణాలు కనిపించినవారు వెంటనే అందుబాటులో ఉన్న వైద్యులను సంప్రదించాలన్నారు. బీపీ, మధుమేహం, వృద్ధాప్యంలో ఉన్నవారిలో ఎక్కువ శాతం మందికి కిడ్నీ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. దీంతో పాటు జెనిటిక్ కారణంగా కూడా రావచ్చన్నారు. అందుకే ప్రతి ఒక్కరు ఏడాది ఒకసారి కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నెఫ్రాలజీ వైద్యులు డాక్టర్ అనిల్ మహాపాత్రో, డాక్టర్ వంశీధర్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ.30లక్షల పరిహారం



మృతుని కుటుంబ సభ్యులకు పరిహారం అందజేస్తున్న కార్పొరేటర్ సూర్యకుమారి, రాజు

పెదగంట్యాడ: మృతుని కుటుంబానికి కంపెనీ యాజమాన్యం పరిహారం అందించి, ఆదుకుంది. వివరాలివి.. జీవీఎంసీ 77వ వార్డు మురుభాయ్‌కు చెందిన మేడిశెట్టి పైడిరాజు స్మైలాక్స్ లాబరేటరీస్ లిమిటెడ్‌లో పని చేసేవారు. పైడి రాజు గత జనవరి 5న ల్యాబ్‌లోని ఓ ఎత్తయిన ప్రదేశంలో పెయింటింగ్ పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తూ కింద పడి మృతి చెందాడు. దీంతో అతని కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ రాజు, కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి చొరవ తీసుకుని సంస్థ యాజమాన్యంతో చర్చలు జరిపారు. మృతుని కుటుంబానికి రూ.30లక్షలు పరిహారం చెల్లించేలా ఒప్పించారు. ఈ మేరకు రూ.30లక్షల చెక్కును మృతుని భార్య మహాలక్ష్మికి మేనేజర్ లక్ష్మణరావు చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కె.శివకుమార్, అప్పలరెడ్డి, అప్పారావు, దేముడు పాల్గొన్నారు.

అనధికారిక బోర్డుల తొలగింపునకు ఆదేశం




సీతకొండ వద్ద బీచ్‌రోడ్డు పనులు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

ఆరిలోవ: నగరంలో జరగనున్న జీ-20 సదస్సును పురస్కరించుకుని బీచ్ రోడ్డులో ఉన్న అనధికారిక బోర్డులను వెంటనే తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు ఆదేశించారు. జీ-20 సదస్సు కోసం బీచ్‌రోడ్డును ఆధునికీకరిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సీతకొండ సీవ్యూ పాయింట్, సాగర్‌నగర్, రాడిసన్ బ్లూ హోటల్ ప్రాంతాలను గురువారం ఆయన అధికారులతో కలసి సందర్శించారు. ఆయా చోట్ల జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు పక్కన పార్కింగ్ స్థలాలు సిద్ధం చేయాలని సూచించారు. పనులు త్వరగా, నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ అలంకరణ పనులు, దీపాలు వెలిగించడం, రోడ్డుకు రంగులు వేయడం, తదితర పనులు వేగవంతం చేయాలన్నారు. డివైడర్లు, రోడ్డు పక్కన అందం కోసం మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి, పట్టణ ప్రణాళిక అధికారి బి.సురేష్‌కుమార్, డీడీ(హార్టికల్చర్) ఎం.దామోదరరావు, జీ-20 లైజినింగ్ ఆర్గనైజర్ చక్రవర్తి, కార్యనిర్వాహక ఇంజినీర్ మత్స్యరాజు, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కిశోర్, డీసీపీ పద్మజ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

బీచ్ రోడ్డు: సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరమని, ఎటువంటి సందేహం ఉన్నా తక్షణమే సైబర్ పోలీసులకు 1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైమ్ సీఐ కె.భవానీప్రసాద్ సూచించారు. గురువారం దిశా, సైబర్ పోలీసులు సంయుక్తంగా సిరిపురంలోని డబ్ల్యూఎన్ఎస్ సంస్థలో ఉద్యోగాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజుల్లో సోషల్ మీడియాలో మహిళలపై జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. ఇంటర్నెట్ ఆధారంగా జరుగుతున్న నేరాలు, ఆన్‌లైన్ షాపింగ్ పేరిట మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పాస్‌వర్డ్ సెక్యూరిటీ టిప్స్, ఫేక్‌లోన్ యాప్స్‌పై అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న సీఐ భవానీప్రసాద్

శాస్త్రోక్తంగా ఆలయాల ప్రారంభోత్సవం



రేజేటి శ్రీరామాచార్యులు పర్యవేక్షణలో సంకల్ప పూజలు చేస్తున్న భక్తులు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెంలో శ్రీరామా సేవా సమాజం(యాదవ్) ఆధ్వర్యంలో నిర్మించిన కోదండ సీతారామ, సంపత్ వేంకటేశ్వర స్వామి, ధనలక్ష్మీదేవి ఆలయాలను గురువారం శాస్త్రోక్తంగా పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై శ్రీమాన్ రేజేటి శ్రీరామాచార్యులు పర్యవేక్షణలో సంకల్ప పూజలు, యాగశాలలో వేదమంత్రాలతో హోమాలు నిర్వహించారు. 10వ తేదీ శుక్రవారం విగ్రహాల ప్రతిష్టాపన, ధ్వజస్తంభం, దేవతామూర్తులు, కలశాల ఏర్పాటు, 11వ తేదీ శనివారం ఉదయం సీతారాములు, సంపత్ వేంకటేశ్వర స్వామి కల్యాణం ఒకే వేదికపై నిర్వహించనున్నట్లు గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ తెలిపారు. అదే రోజు భక్తులందరికీ భారీ అన్నదానం చేస్తామని చెప్పారు. గ్రామ, ఉత్సవ కమిటీల సభ్యులు, గ్రామపెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

- శాస్త్రోక్తంగా స్వర్ణపుష్పార్చన
- వైభవంగా నిత్య కల్యాణం



నిత్యకల్యాణంలో భాగంగా యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు



స్వర్ణపుష్పాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి 8గంటల వరకు స్వర్ణ పుష్పార్చనని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30గంటల నుంచి 10.30గంటల వరకు నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణమంపడంలోని వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రస్రాదాన్ని అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ డి.చంద్రం, సీఐడీ ఎస్పీ కె.జి.వి. సరిత స్వామిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని వారికి అధికారులు అందజేశారు.



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ చంద్రం



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న సీఐడీ ఎస్పీ సరిత

'స్టీల్‌ప్లాంట్ జోలికొస్తే సహించం'



756వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న ఉక్కు కార్మికులు

కూర్మన్నపాలెం: ఉక్కు పోరాట యోధుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తే, చూస్తూ సహించబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 756వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు తిరగబడే రోజు వస్తుందన్నారు. కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాలు నేటికీ దీనస్థితిలో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రభుత్వరంగ సంస్థల జోలికి రాకుండా ఉంటే మంచిదని హితవు పలికారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని విరమిస్తున్నట్లు ప్రకటించాలని, లేదంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు 24 మంది



పోటీలు ప్రారంభిస్తున్న మోహన్‌కృష్ణ

మధురవాడ: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలకు విశాఖ జిల్లా తరపున పాల్గొనే మహిళ, పురుష జట్లకు 24 మంది ఎంపికయ్యారు. మధురవాడ శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్‌లో ఎంపిక పోటీలను గురువారం మధ్యాహ్నం సంస్థ చైర్మన్ ఎం.మోహన్‌కృష్ణ ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారుల మధ్య ఉత్సాహంగా పోటీలు జరిగాయి. వీరిలో 12 మంది చొప్పున పురుష, మహిళ జట్లను అబ్జర్వర్, ఎన్ఐఎస్ కోచ్ కె.చిట్టిబాబు పర్యవేక్షణలో ఎన్ఐఎస్ కోచ్‌లు కె.కావ్య, ఐ.చరణ్ ఎంపిక చేశారు. 9వ రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మెన్ అండ్ వుమెన్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు కాకినాడలో లేడీస్ క్లబ్ ద్రోణ అకాడమీలో శుక్రవారం నుంచి నిర్వహించనున్నారు.

రాష్ట్ర జట్లు ఇవే : రాష్ట్ర స్థాయి పోటీలకు మహిళల జట్టుకి కె.లిఖిత, బి.రాజేశ్వరి, ఎస్.లహరి, డి.శృతి ప్రియ, పి.ప్రసన్న, సీహెచ్.సాయిప్రభ, ఇ.జ్ఞానేశ్వరి, టి.లిఖిత, ఎ.జాహ్నవి, ఎమ్.జ్యోత్స్న, ఎస్.జ్యోతి, ఎస్.పూజిత ఎంపికయ్యారు. పురుషుల జట్టుకి ఎ.సంపత్, ఆకాశ్ వర్ధన్, ఎమ్.జోయల్ యశ్వంత్ కుమార్, జి.రుత్విక్, వి.దిలీప్ కుమార్, కె.కార్తీక్, కె.శివశంకర్, ఎ.జీవన్, వి.పూర్ణచంద్ర ప్రసాద్, ఎస్.రాజేష్, ఎస్.సత్యనారాయణ, కె.మనోజ్‌కుమార్ ఎంపికయ్యారు.

బాల్య వివాహానికి బ్రేక్



వధూవరుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఐసీడీఎస్ అధికారులు, చైల్డ్‌లైన్ సంస్థ ప్రతినిధులు

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మైనర్ బాలిక వివాహానికి బ్రేక్ పడింది. అర్ధరాత్రి సమయంలో జరగాల్సిన వివాహం గురువారం సాయంత్రమే నిలిచిపోయింది. ఐసీడీఎస్, సీడ్ చైల్డ్‌లైన్ సంస్థల ప్రతినిధులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన సుమారు 17 ఏళ్ల బాలికకు జీవీఎంసీ 10వ వార్డు పరిధి ఆదర్శనగర్‌కు చెందిన 26 ఏళ్ల యువకుడితో వివాహం నిశ్చయమైంది. వారి తల్లిదండ్రులు రవీంద్రనగర్‌లో ఓ కల్యాణ మండంపలో గురువారం వివాహం చేయడానికి ఏర్పాట్లు చేశారు. రాత్రి 12 గంటలకు వారికి వివాహం జరిపించే హడావిడిలో అంతా ఉన్నారు. ఇంతలో అజ్ఞాత వ్యక్తులు చైల్డ్‌లైన్ సంస్థ టోల్‌ఫ్రీ నంబరు 1098కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఐసీడీఎస్ జిల్లా అధికారి వి.సరిత, చైల్డ్‌లైన్ సంస్థ ప్రతినిధులు మీనాకుమారి, సుబ్బలక్ష్మి, చినగదిలి మండలం ఆర్ఐ ప్రవీణ్, మహిళా పోలీసులు సత్యవేణి, స్వాతి, అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి, తదితర సిబ్బంది రవీంద్రనగర్‌లోని కల్యాణ మండపం వద్దకు చేరుకున్నారు. వధూవరుల వయస్సులు తెలుసుకున్నారు. పెళ్లి కుమార్తె ఇంకా మైనర్ అని, వివాహం నిలిపేయాలని ఆమె తల్లిదండ్రులకు సూచించారు. ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని, తాళి కట్టే సమయానికి ఎలా నిలిపేయామంటారని ఇరువురి తల్లిదండ్రులు అధికారులతో వాగ్వాదం చేశారు. దీంతో వారికి ఐసీడీఎస్, చైల్డ్‌లైన్ అధికారులు బాల్య వివాహంపై అవగాహన కల్పించారు. వివాహం జరిపితే అంతా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. దీంతో వివాహం ఆగిపోయింది.